సేవలు దూరం!

నాడు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చింది. ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసింది. ఇంటికి సమీపంలోనే అన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకుంది.

నేడు: గత ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన అందిస్తామంటూ గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సచివాలయాల సేవలకు తూట్లు పొడుస్తోంది. ప్రజా సేవలకు కోత విధిస్తోంది. రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు.దీంతో అన్ని వర్గాల ప్రజల కూటమి ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల సేవలను నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నేడు: వెలవెలబోతున్న సచివాలయం

- సచివాలయాల సేవలను తగిస్తున్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్లు
- గత ప్రభుత్వంలో 545 సేవలు అందుబాటులో..
- నేడు గందరగోళ పరిస్థితి


నాడు: లబ్ధిదారులతో కళకళలాడుతున్న సచివాలయం

పెదగంట్యాడ: ఉన్న ప్రాంతంలోనే ప్రజలకు సకల సేవలు అందజేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం పల్లెల్లో గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. సచివాలయాలకు అనుసంధానంగా 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించి తమ పరిధిలో వారికి ఏ సేవలు కావాలన్నా ఇంటివద్దకే ప్రజలకు నేరుగా అందించేవారు. ఇందులో భాగంగా గాజువాక నియోజకవర్గ పరిధిలో 107 సచివాలయాలు ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం,వ్యవసాయ, రెవెన్యూ,పోలీస్, విద్యుత్ తదితర సేవలు, వివిధ ధ్రువ పత్రాలు వంటి మరెన్నో సేవలను ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా పొందేవారు. దాదాపు 545 సేవలు అందేవి.


బోసిపోయిన సచివాలయం లోపలి భాగం

కూటమి సర్కారు తూట్లు

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సేవలకు తూట్లు పడ్డాయి. దీంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి. సచివాలయాల్లో సేవలను గత ప్రభుత్వం లాగే కొనసాగించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో!

కూటమి ప్రభుత్వం ఏర్పడి 130 రోజులు దాటినా ఇంతవరకూ అర్హులైన వారికి కొత్త పింఛన్లపై ఎలాంటి ప్రకటన చేయలేదు. లబ్ధిదారులు రోజూ దరఖాస్తులు పట్టుకుని రోజు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెబ్‌సైట్లు ఓపెన్ కావడం లేదని సిబ్బంది సమాధానం ఇవ్వడంతో నిరాశతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. తాము అధికారంలోకి వస్తే బీసీ,ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు..

రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం నిరీక్షణ

నూతన ప్రభుత్వ ఇప్పటి వరకూ ఒక్క రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సచివాలయాల్లో అలాంటి సేవలు లేవని సిబ్బంది చెబుతున్నారు.

అయోమయంలో వలంటీర్లు

గత ప్రభుత్వంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పని చేసిన వలంటీర్లకు కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తే రూ.10వేల వేతనం ఇస్తామని ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను దూరం పెడుతూ వచ్చారు. వారిని అయోమయానికి గురి చేస్తూ వస్తున్నారు. ప్రభుత్వం స్పందించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామని వలంటీర్లు చెబుతున్నారు.

రైస్ కార్డు దరఖాస్తు ఎక్కడ ఇవ్వాలి



గతంలో ఏమైనా పనులు కావాలంటే సచివాలయంలో పొందే వాళ్లం. వలంటీర్ ఇంటికి వచ్చి మరీ మాతో దరఖాస్తు చేయించి మాకు కావాల్సిన పనులు చేసేవారు.ఇప్పుడు ఏమైనా పథకాలు కావాలంటే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. నాకు రైస్ కార్డు కావాల్సి ఉంది. దీని కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను. వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు.ఎక్కడికి వెళ్లాలని అడిగితే కనీసం సమాచారం తెలపడం లేదు.ప్రభుత్వం పట్టించుకుని వెబ్‌సైట్లు ఓపెన్ చేయాలి.

– ఎం.కళ్యాణి, పెదగంట్యాడ

వెబ్‌సైట్లు ఓపెన్ కాలేదు



నేను ఆరోగ్య శ్రీ కార్డు కోసం రోజు సచివాలయానికి వెళ్తున్నాను. సచివాలయాల్లో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కోసం దరఖాస్తు చేయడానికి అవకాశం లేదు. వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు.ఎప్పుడు ఓపెన్ చేస్తారనే దానిపై సమాచారం లేదని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పుడు చూస్తాం అంటున్నారు. వెబ్‌సైట్ ఎప్పుడు ఓపెన్ చేస్తారో వాళ్లకే స్పష్టత లేదు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

– జి.దేవి మదీనాభాగ్, పెదగంట్యాడ.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల గోడు పట్టదా!

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఉక్కు ఉద్యోగులకు, ఆర్నెల్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. దసరా, దీపావళి పండగలకు జీతాలు చెల్లించకుండా కార్మికుల కుటుంబాలను మానసిక క్షోభకు గురి చేశారన్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్ ఫండ్ రూ. 400 కోట్లు, త్రిఫ్ట్ లోన్ రికవరీ రూ. 70 కోట్లు, సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ రూ. 100 కోట్లు, జీతభత్యాలు రూ. 300 కోట్లు, చనిపోయిన కార్మికులకు సంబంధించిన రూ. 40 కోట్లు వెరసి సుమారు వెయ్యి కోట్లు యాజమాన్యం వద్ద ఉంచుకున్నారన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆ సొమ్ముతో రామెటీరియల్ కొంటున్నారన్నారు. ఇంత దౌర్భాగ్యపరిస్థితిని గడిచిన 40 ఏళ్లలో ఎన్నడూ చూడలేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉక్కు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు కుటుంబాలతో రోడ్డెక్కి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారి పరదేశినాయుడుపై చర్యలు తీసుకోవాలి

ఉక్కునగరం: దొంగ ఆర్ కార్డుతో స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం పొందిన టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం డిప్యూటీ మేనేజర్ గండేపల్లి పరదేశి నాయుడుపై చర్యలు తీసుకోవాలని పెదగంట్యాడ మండలం ఆర్ హెచ్ కాలనీ నెల్లిముక్కు వాసి యెల్లేటి సీత, యెల్లేటి నరసయ్యమ్మ, యెల్లేటి దేముళ్లు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీకు లేఖ అందజేశారు. పరదేశి నాయుడు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా మోసం చేసి ఆర్ కార్డును తన పేరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం పొందారన్నారు. పరదేశి నాయుడుకు తమ కుటుంబానికి ఎటువంటి రక్త సంబంధం లేదన్నారు. ఈ అంశంపై గతేడాది సెప్టెంబర్ 25న ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కూడా దొంగ ఆర్ కార్డు అని గుర్తించారన్నారు. ఈ అంశంపై అతనిపై కేసు నమోదు చేశారన్నారు. చట్టప్రకారం అతన్ని ఉద్యోగం నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

47 మద్యం బాటిళ్లు స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 47 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ వద్ద ద్వారపూడి చంద్రనాయుడు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా మద్యం బాటిళ్లు ఉన్నాయన్న సమాచారంతో దాడులు చేసి 47 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో 6 డిఫెన్స్ బాటిళ్లు ఉన్నట్టు తెలిపారు. చంద్రనాయుడును అదుపులోకి తీసుకుని విచారించగా మల్కాపురానికి చెందిన నవీన్ కుమార్ మద్యం బాటిళ్లను తనకు అప్పగించినట్టు చెప్పాడన్నారు. కాగా నవీన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తనకు నేవల్ ఉద్యోగి ధీరజ్ కుమార్ 6 డిఫెన్స్ బాటిళ్లు ఇచ్చాడని చెప్పాడు. చంద్రనాయుడు, నవీన్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ధీరజ్ కుమార్‌ను విచారిస్తున్నామన్నారు.

సమస్యలపై వినతి


జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాలు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ కాలనీలో సమస్యలపై కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో అన్ని చోట్ల రోడ్లు, డ్రైన్లు పూర్తిగా శిథిలమయ్యాయని పేర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్లు, కాలువలు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఘనంగా అన్న సమారాధన


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవ కాలనీలోని శివ కేశవ సన్నిధి, భద్రావతి, భావనా రుషి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ముందుగా ఆలయంలోని శివుడిని దర్శించుకున్నారు. రుద్రాభిషేకంలో పాల్గొన్నారు.

ఆహార నియమాలతో ఆరోగ్యం


వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గాజువాక: ఆహార నియమాలను పాటించడంతో పాటు చిన్నపాటి వ్యాయామాలు చేయడం ద్వారా షుగర్ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంగా ఉండవచ్చని గాజువాక పీహెచ్‌సీ సహాయ వైద్యాధికారి డాక్టర్ బద్రి నారాయణమూర్తి అన్నారు. 60 ఏళ్ల దాటిన వారికి బీపీ, షుగర్, ఊపిరితిత్తుల వ్యాధులపై మినర్వా స్కూల్ నర్సింగ్ విద్యార్థులకు రోల్ ప్లే విధానం ద్వారా అవగాహన కల్పించారు. వారు తీసుకోవాల్సిన ఆహార నియమాను ఈ సందర్భంగా వివరించారు. సీహెచ్‌వో పి.నాగ అప్పారావు మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు స్వీట్లు, దుంపలు, పండ్లు తినడం తగ్గించుకోవాలన్నారు. ప్రతిరోజూ పరగడుపున వేడి నీరు తాగాలని సూచించారు. కనీసం 20 నిమిషాలపాటు నడవడం ద్వారా షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చన్నారు.

కార్మిక పక్షపాతి మస్తానప్ప


స్టీల్‌ప్లాంట్‌లో మస్తానప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: కార్మికుల సంక్షేమానికి వై. మస్తానప్ప ఎనలేని సేవలు అందించారని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు కొనియాడారు. సోమవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో మస్తానప్ప సంతాప సభ నిర్వహించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మస్తానప్ప సేవలను కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శిగా, వైఎస్సార్ టీయూసీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్‌గా కార్మికుల అభివృద్ధికి విశేషమైన కృషి చేశారన్నారు. దాదాపు 37 సంవత్సరాలు కార్మిక నాయకుడిగా మస్తానప్ప పని చేశారని... ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, మసేనురావు, జి.వి. రమణారెడ్డి, బయ్యే మల్లయ్య, గణపతిరెడ్డి, జి. రమణారెడ్డి, వై.టి. దాస్, మొల్లి ఈశ్వరరావు, డి.వి. రమణారెడ్డి, ఎం. పరదేశి, పిట్టారెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ తదితరులు పాల్గొన్నారు

సీసీ కెమెరాలు ప్రారంభం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ మల్లేశ్వరరావు

అగనంపూడి: జీవీఎంసీ 85 వార్డు కొండయ్యవలస సీతారామ ఆలయం, బంగారమ్మ గుడిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సిటీలో దేశ నలుమూలల నుంచి వచ్చి వ్యాపార, పరిశ్రమల వల్ల జనం జీవనం సాగిస్తున్నారన్నారు. గ్రామాలు, దేవాలయాల్లో దొంగతనాలు, ఆకతాయి పనులు చేసేవారిని గుర్తించటానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా కొండయ్య వలస పరిసర ప్రాంతాల్లో నేరాలు , ట్రాఫిక్ రద్దీ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను నివారించాలని సీఐకు గ్రామపెద్దలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి శ్రీను, బలిరెడ్డి సత్యనారాయణ, మరిశా రామచంద్రరావు, ఇందుల వరహాలు, బొండా ఈశ్వరరావు, విందుల రాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

గాజువాక: వచ్చే వారం నుంచి గాజువాక జోన్‌లో నైపుణ్య గణన ప్రారంభమవుతుందని జోనల్ కమిషనర్ శేషాద్రి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొననున్న ఎన్యూమరేటర్లకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వ్యక్తులకు సంబంధించిన విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, వారి ఉద్యోగ ఆసక్తులను సేకరించాల్సి ఉంటుందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు. సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని దాని పరిధిలో జనావాసాలను క్లస్టర్‌గా విభజిస్తామన్నారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించి సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేస్తామని చెప్పారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం నిపుణుడు దేవీ గణేష్ మురళి ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. యాప్ పనితీరును, సేకరించాల్సిన వివరాలను తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది కమలాకర్, రామేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

950 కిలోల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

అగనంపూడి: అక్రమంగా తరలిస్తున్న 950 కిలోల రేషన్ బియ్యాన్ని దువ్వాడ పోలీసులు పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు అప్పికొండ కాలనీలో నివాసం ఉంటున్న కె.వెంకటరమణ తన సమీప బంధువైన తూర్పుగోదావరి జిల్లా తుని మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన సుబ్బారావుతో కలిసి పీడీఎస్ రైస్‌ను ఇళ్ల వద్ద కేజీ రూ.15కే కొనుగోలు చేసి ఎక్కువ ధరకు సబ్బవరంలో రైస్ మిల్లులకు తరలించేవాడని తెలిపారు. దీనిపై వచ్చిన సమాచారంతో దువ్వాడ పోలీసులు అప్పికొండలో ఆటోలో బియ్యం లోడ్ చేస్తుండగా ఆటోతో పాటు 19 బియ్యం బస్తాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని ఏఎస్‌వోకు అప్పగించి, తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

హర హర మహాదేవ

- మార్మోగిన శివనామస్మరణ
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు


పరమేశ్వరునికి బిల్వ పత్రాలతో పూజ చేస్తున్న అర్చకుడు వాసుదేవశర్మ


పూజలందుకున్న శివయ్య


కణితి రోడ్‌లోని ఏకాంబరాలయంలో క్షీరాభిషేకం


ఉక్కు బీసీ గేటు శివాలయంలో ..


వాసవీ సంచయతన ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం


అక్కిరెడ్డిపాలెంలో పూజలందుకున్న ఉమారామలింగేశ్వరుడు


తిరుమల బాలాజీ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. హరహర మహాదేవ నామస్మరణతో హోరెత్తించారు. భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తులసికోట, ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద దీపారాధన చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు

జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులో వేంచేసియున్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో శివయ్యను ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

- 77వ వార్డు అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.
- 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కులోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- హౌసింగ్‌బోర్డులో వాసవీ పంచయతన దేవాలయంలో పరమేశ్వరుని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. వుడా కాలనీ శివాలయంలో పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం మొదటి సోమవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది, శీలానగర్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయాలు

గాజువాక: పవిత్ర కార్తీక మాసంలో తొలి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి.భక్తులతో ఆలయాలు కళకళలాడాయి.వినాయకనగర్ ఉడాకాలనీలోని కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు, దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాలు, బీసీ రోడ్డు సంజీవకాలనీలో శ్రీ భద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణస్వామి ఆలయాల్లోని పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీనగర్ ప్రాంతంలోని దుర్గానగర్‌లో శ్రీదుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతీ దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం సందర్భంగా శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కార్తీకమాసం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా కార్తీకదీపం పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ఉక్కు నగరంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివాలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. సెక్టర్–6 శివాలయంలో భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో బయట వరకు బారులు తీరారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు చేశారు. రుత్వికుల ఆధ్వర్యంలో హోమాలు చేశారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. రవీ రేస్ సమీపంలోని పురాతన శివాలయంలో వేకువ జాము నుంచి పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసారు. కణితి, వడ్లపూడి కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

భారీ వాహనాల పార్కింగ్‌తో కష్టాలు


శీలానగర్ వద్ద రోడ్డుపై పార్క్ చేసిన భారీ వాహనాలు

అక్కిరెడ్డిపాలెం: భారీ వాహనాలను యజమానులు తమ వాహనాలను రోజుల కొద్దీ రోడ్డుపై పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. శీలానగర్ కిమ్స్ ఐకాన్ రోడ్డులోని అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రం వద్ద రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు నిలపడంతో పరీక్షకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రాత్రి సమయంలో శీలానగర్, వెంకటేశ్వరకాలనీలకు చెందిన పలువురు మహిళలు ఉద్యోగాల నుంచి ఇంటికి చేరే క్రమంలో ఈ వాహనాల పక్క నుంచి ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ అధికారులు రోడ్డుపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలు, ఇతర వాహనాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.